క్లుప్తంగా

సాక్షిగణపతి, జ్వాలా వీరభద్ర స్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి పుష్పార్చన, నివేదన కార్యక్రమా లు చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి

మహానంది: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు చేసిన మంచి పనులే చిరస్థాయిగా నిలుస్తాయని బండిఆత్మకూరు మండల ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఈఓఆర్‌డీ శ్రీనివాసులు డీఏఓగా పదోన్నతి పొంది ఆదోనికి బదిలీ అయిన సందర్భంగా బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవగుప్త, ఏఓ హనీఫ్‌ఖాన్, పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్, బండిఆత్మకూరు సర్పంచ్ సంధ్య, వైస్ సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి, నాయకులు పల్లె సోమశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కాకనూరు మహేశ్వరరెడ్డి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి

ఆత్మకూరు: స్థానిక కస్తూర్బా విద్యాలయాన్ని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడుతూ..పాఠశాలలో సమస్యలు, భోజనం, సమయానికి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణ, ఆటస్థలం, మినరల్ వాటర్ ప్లాంటును తనిఖీ చేశారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థినులకు సక్రమంగా భోజనం అందించాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మినరల్ వాటర్‌ను అందించాలన్నారు. ప్రిన్సిపాల్, న్యాయవాదులు, ఉపాధ్యాయునులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

నందికొట్కూరు: పట్టణంలోని శ్రీనవనంది హైస్కూల్‌లో బుధవారం 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహించారు. 300 మంది విద్యార్థులతో స్కూల్ ప్రాంగణం నుంచి సాయిబాబ పేట వీధి మీదుగా ర్యాలీ సాగింది. ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరై ర్యాలీని ప్రారంభించారు. పాఠశాల చైర్మన్ బద్దుల శ్రీధర్, హెచ్‌ఎం బి.నరసప్ప, కోఆర్డినేటర్ మౌలాలి జిన్నా పాల్గొన్నారు.


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఆత్మకూరు: పట్టణంలో వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, వెంకటేశ్వర విద్యాసంస్థల అధినేత సాయిప్రణీత్, చైతన్య స్కూల్ కరస్పాండెంట్ తాజుదున్, రాజరాజేశ్వరి స్కూల్ కరస్పాండెంట్ పురుషోత్తం, సీఐటీయూ పట్టణాధ్యక్షుడు రజాక్, కార్యదర్శి రామునాయక్ మాట్లాడారు.

రోడ్డు సమస్యను పరిష్కరించండి

ఆత్మకూరు: పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామంలో హైవే వెడల్పు సమస్యను పరిష్కరించాలని మస్జీద్ పెద్దలు, బీజేపీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోమిన్‌షబానా బుధవారం డీఎస్పీ రామంజినాయక్‌కు వినతి పత్రం అందజేసి విన్నవించారు. వారు మాట్లాడుతూ ఎర్రగడూరు గ్రామంలో హైవే వెడల్పులో భాగంగా కొంత భాగం మస్జీద్‌కు చెందిన స్థలాన్ని హైవేకు కోసం ఇచ్చారన్నారు. అయితే ఇచ్చిన స్థలం కన్నా ఇంకా అదనంగా స్థలం ఇవ్వాలని హైవే అధికారులు చెప్పారన్నారు.

శివ..శివా!



శిఖరేశ్వరం నంది సర్కిల్ వద్ద మాంసాహారం తింటున్న మహిళ

శ్రీశైలం : క్షేత్రంలోని శిఖరేశ్వరం సమీపంలోని కృష్ణయ్య నంది సర్కిల్ వద్ద అన్యమతస్తులు కొందరు మాంసాహారం తింటుండగా గుర్తించిన కొందరు భక్తులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైలం ముఖద్వారం- శిఖరేశ్వరం మధ్యలో ఉన్న నంది సర్కిల్ వద్ద బిర్యానీ తింటుండటం చూసిన భక్తులు మండిపడ్డారు. పవిత్ర పుణ్యక్షేత్రంలో మాంసాహారం ఎలా తింటారని నిలదీయడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది శ్రీశైలం నుంచి శిఖరం వరకు పగలు కూడా పెట్రోలింగ్ చేయాలని భక్తులు సూచిస్తున్నారు.

ఆరోగ్య కేంద్రానికి సుస్తీ

- అపరిశుభ్రంగా తిమ్మాపురం పీహెచ్‌సీ పరిసరాలు
- విజృంభిస్తున్న దోమలు
- విష జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
- ఒక్క డాక్టరే ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రులకు రోగులు
- దండుకుంటున్న ఆర్‌ఎంపీలు



ఆస్పత్రి ప్రధాన గేటు ముందు నిలిచిన మురుగు నీరు



ఆస్పత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి..



బుధవారం ఉదయం ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

మహానంది: అసలే వర్షాకాలం, ఓ వైపు అపరిశుభ్రత.. మరో వైపు దోమల దండయాత్ర.. ఫలితంగా విషజ్వరాల బారిన జనం. మండలంలోని ప్రతి గ్రామంలో జనం విష జ్వరాల బారిన పడ్డారు. జ్వరాలు తగ్గకపోవడంతో జనం గ్రామాల్లో ఉండే ఆర్‌ఎంపీలతో పాటు పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. అక్కడ మలేరియా, టైఫాయిడ్, డెంగీ అంటూ పలు రకాల రక్తపరీక్షలు చేసి బిల్లులు తడిసి మోపెడయ్యేలా వేస్తుండటంతో పేదలు అల్లాడిపోతున్నారు. గ్రామాల్లో ఇంతటి పరిస్థితులు ఉంటే పీహెచ్‌సీ సిబ్బంది మాత్రం తామొచ్చిందే సమయం అంటూ అలా వచ్చి.. ఇలా వెళ్లిపోతున్నారు. దీంతో గ్రామాల్లో వైద్యానికి జబ్బు చేసింది.

డాక్టర్ ఎప్పుడొస్తారో?

మహానంది మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. పీహెచ్‌సీ పరిధిలో 10 గ్రామాలు ఉన్నాయి. సుమారు 38,200 మంది ప్రజలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఇద్దరు డాక్టర్లు పనిచేసేవారు. వైద్యాధికారి భగవాన్‌దాస్‌తో పాటు మరో డాక్టర్ శాంతిప్రియ సేవలందించేవారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉద్యోగం రావడంతో శాంతిప్రియ నాలుగు నెలల క్రితం వెళ్లిపోయింది. ఖాళీగా ఉన్న ఒక డాక్టర్ స్థానంలో నంద్యాల డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో పనిచేసే డాక్టర్ రంజిత్ కుమారి అప్పుడప్పుడు వస్తూ వైద్యసేవలు అందిస్తుంటారు. ఇక వైద్యాధికారి నిత్యం వివిధ కార్యక్రమాల పేరుతో రోగులకు సక్రమంగా అందుబాటులో ఉండటం లేదు.

ఒక్కరే గతి..

పేరుకు 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రమైనా ఒక్కరే డాక్టర్ ఉండటంతో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదు. దీంతో పలు రోగాల బారిన పడిన ప్రజలు గ్రామాల్లో ఉండే ఆర్‌ఎంపీలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఇదిలా ఉండగా ఆస్పత్రిలో లేని సమయంలో ఎవరైనా ఫోన్ చేసి ప్రశ్నిస్తే ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో ఉన్నానని సమాధానం చెప్పడం పరిపాటిగా మారింది. బుధవారం ఈ విషయంపై సాక్షి వివరణ కోరగా తాను నంద్యాల మండలం పెద్దకొట్టాలలో జరిగే ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంలో ఉన్నానని చెప్పారు.

అపరిశుభ్రతకు కేరాఫ్..

సాధారణంగా ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉంటాయి. కానీ ఈ పీహెచ్‌సీ ఆవరణతో పాటు పరిసరాలు అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారింది. ఆస్పత్రి ప్రధాన గేటు ముందే మురుగు నీరు నిలిచి స్వాగతం పలుకుతుంది. ఆవరణలో మురుగు దుర్గంధం వెదజల్లుతుంది. ఇక వైద్యశాల ఆవరణలో చెత్తా, చెదారం, ప్లాస్టిక్ బాటిళ్లు ఎక్కడ పడితే అక్కడ ఉండటం చూస్తే ప్రజారోగ్యానికి, బాధ్యతలకు సిబ్బంది ఇస్తున్న ప్రాధాన్యత ఏపాటిదో అర్థమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడంతో పాటు ఆసుపత్రి ఆవరణను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రైతు సేవా కేంద్రాల తనిఖీ



ఎదురుపాడులో కూలీలు, రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు, కొక్కెరంచ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.ఆంజనేయ బుధవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉంటూ సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. రైతులు ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటలను సాగుచేసుకున్నారని వాటి రకాలను ఆన్‌లైన్ ద్వారా పంటనమోదు చేయించాలని తెలిపారు. కౌలు రైతులను గుర్తించి సీసీఆర్ కార్డులు ఇచ్చేలా చూడాలని ఆదేశించారు. ప్రతి రైతుసేవా కేంద్రంలో ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. తప్పులు లేకుండా పంట నమోదు చేపట్టాలని ఆదేశించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయాధికారి మహేష్, రైతుసేవా కేంద్రం సిబ్బంది అశోక్, షఫీ ఉన్నారు.

మిత్ర గ్రూపుల ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న ఏపీఎం పుల్లయ్య

కొత్తపల్లి: రైతు మిత్ర గ్రూపుల ద్వారా రైతుల అభివృద్ధి సాధ్యం అవుతుందని వెలుగు ఏపీఎం పుల్లయ్య, ఏఓ మహేష్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో రైతుమిత్ర సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 200 రైతు మిత్ర గ్రూపులకు నాలుగు నెలల్లో సుమారు రూ.85 లక్షల వరకు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ గ్రూపుల ద్వారా రైతులకు బ్యాంకు, పొదుపు రుణాలు ఇస్తున్నామన్నారు. అదే విధంగా ఈక్రాప్, ఇన్సురెన్స్, సబ్సిడీ రుణాలు, పీఎం ఈజీపీ, పీఎం ఎఫ్‌ఎంఈ, పీఎం జేజేబీవై, ఎస్‌బీవై, బుక్‌కీపింగ్ వంటివాటిపై అవగాహన కల్పించారు. బీటీడీ రాజగోపాల్ రెడ్డి, రైతుమిత్ర గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి



మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

నందికొట్కూరు: పట్టణంలోని మున్సిపల్ స్థలం వివాదంపై వాస్తవాలు తెలుసుకుని కాకరవాడ చిన్న వెంకటస్వామి మాట్లాడాలని ఐద్వా, వ్యాకాస, కేవీపీఎస్ నాయకురాలు అన్నారు. బుధవారం స్థానిక భరత్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యాకాస రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఈశ్వరమ్మ, కేవీపీఎస్ జిల్లా నాయకురాలు ఆరు జయరాణి, ఐద్వా నాయకురాలు మద్దమ్మ మాట్లాడారు. టీడీపీ నాయకుడు కాకరవాడ చిన్న వెంకటస్వామి భూకబ్జాల భాగోతం అందరికీ తెలుసన్నారు. వాస్తవంగా పాండురంగ స్వామి దేవాలయం సమీపంలో ఉన్న మున్సిపాలిటీ స్థలంలో పేద కార్మికులు మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నారని తెలిపారు. కరెంటు మీటర్లు బిగించుకుని బంకులు ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తుంటే సహించలేకపోతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కోట్లు విలువ చేసే స్థలం కొట్టేయడం ఎంత వరకు సమంజసం అన్నారు.

పాములపాడు ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



నూతన ఎస్‌ఐ సురేష్‌బాబు, బదిలీ అయిన ఎస్‌ఐ అశోక్

పాములపాడు: మండల ఎస్‌ఐగా సురేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లా బుక్కాయపట్నం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. నాటు, అక్రమ మద్యం విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

వెల్దుర్తి మండలానికి వెళ్లిన ఎస్‌ఐ అశోక్

ఇది వరకు ఇక్కడ ఎస్‌ఐగా ఉన్న అశోక్ వెల్దుర్తి మండలానికి బదిలీపై వెళ్లారు. బుధవారం రిలీవ్ అయ్యారు. పోలీసు సిబ్బంది, రాజకీయ నాయకులు ఆయనకు దుశ్శాలువాలు, పూలమాలలు వేసి వీడ్కోలు పలికారు. ఉద్వేగానికి గురైన ఎస్‌ఐ అశోక్, సిబ్బంది కన్నీటి పర్యంతమయ్యారు. అందరి సహకారం మరువలేనని భావోద్వేగంతో మాట్లాడారు.

శ్రీశైలంలో ద్విశతావధానం ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈఓ



ద్విశతావధానం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం పశ్చిమగోదావరి జిల్లా భీమడోలుకు చెందిన డా.బులుసు అపర్ణ వారి ద్విశతావధానం ఏర్పాటు చేశారు. బుధవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళారాధన వేదికపై అవధాన కవితా నీరాజనం పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఐదు రోజుల పాటు జరుగనుంది. దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ద్విశతావధాన కార్యక్రమం నిర్వహిస్తారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రసిద్ధులైన 60 మంది కవి పండితులు పృచ్ఛకులుగా పాల్గొన్నారు. ఈఓ మాట్లాడుతూ భక్తి సాహిత్య కార్యక్రమాల నిర్వహణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రసిద్ధులైన కవిపండితులు, అవధానులు, రచయితలు పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. డోన్‌కు చెందిన గండ్లూరి దత్తాత్రేయశర్మ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల నిర్వహణ వల్ల సామాన్యులకు కూడా తెలుగు సాహిత్య గొప్పతనంపై అవగాహన కలుగుతుందన్నారు. చివరిగా డా.బులుసు అపర్ణ ద్విశతావధానం ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త డా.పేరి రవికుమార్ సభాసంధానకర్తగా వ్యవహరించారు హైదరాబాద్‌కు చెందిన సురంభి శంకరశర్మ అప్రస్తుత ప్రసంగం చేశారు.

రేషన్‌బియ్యం పట్టివేత

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామంలో నిల్వచేసిన 22 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ముందస్తు సమాచారంతో ఎస్‌ఐ తన సిబ్బందితో గ్రామంలోని శ్రీరాంనగర్‌కాలనీలోని ఓ ఇంటిని తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వచేసిన 22 బస్తాల రేషన్‌బియ్యం బస్తాలను గుర్తించారు. నందికొట్కూరు పట్టణానికి చెందిన గాజుల మహ్మద్ ముజిబ్ రహిమాన్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



మండ్లెం గ్రామంలోని ఓ ఇంట్లో నిల్వచేసిన రేషన్ బియ్యం

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

నందికొట్కూరు: మున్సిపాలిటీలో పనిచేస్తున్న 60 మంది రోజువారి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నందికొట్కూరు పురపాలక సంఘం కమిషనర్ సుధాకర్ రెడ్డికి బుధవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ.. ఐదేళ్ల నుంచి 60 మంది కార్మికులు రూ.9,600 వేతనంలో పనిచేస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలతో కుటుంబాన్ని పోషించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి కార్మికుడికి రూ. 18 వేలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూనిఫాం, మాస్కులు, కొబ్బరినూనె, సబ్బులు, గ్లౌజులు, బూట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్పందించిన కమిషనర్ తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని, ప్రభుత్వపరంగా ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు. కార్మిక సంఘం నాయకులు ఎం.గోపాల్, ఎల్ల నాయుడు, అశోక్ కుమార్, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

వేడుకలను ఘనంగా జరుపుకుందాం

ఆత్మకూరు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేద్దామని బుధవారం పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పద్మావతి మాట్లాడుతూ 78వ స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద..

స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు పార్టీ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ ఉంటుందన్నారు.

చేపల వేట నిషేధం

శ్రీశైలంప్రాజెక్ట్: చేపలవేట నిషేధిత సమయమైన జూలై1 నుంచి ఆగస్టు31వ తేదీ వరకు నదిలో ఎవరూ చేపలు పట్టకూడదని ఆత్మకూరు మత్స్య అభివృద్ధి అధికారి కె.బి.భరత్‌లాల్ నాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చేపల పునరుత్పత్తి కాలంలో వేట చేయడం వల్ల మత్స్య సంపద తరిగిపోతుందన్నారు. మండలంలోని లింగాలగట్టు గ్రామ మత్స్యకారులు శ్రీశైలం డ్యాం దిగువ, ఎగువ ప్రాంతాలలో చేపలవేట సాగిస్తున్న మత్స్యకారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సున్నిపెంట స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మహానంది ఎస్‌ఐగా విష్ణునారాయణ?

మహానంది: మండల సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విష్ణునారాయణ రానున్నట్లు సమాచారం. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న నాగేంద్రప్రసాద్ ఇటీవల సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ప్రస్తుతం గోస్పాడులో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నాగార్జునరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రెగ్యులర్ ఎస్‌ఐగా విష్ణునారాయణ వస్తారని సమాచారం. ఈయన గతంలో బండిఆత్మకూరు, రుద్రవరం మండలాల్లో పనిచేశారు.

మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై నందికొట్కూరుకు చెందిన లిక్షితాశ్రీ నృత్యకళాశాల వారి కూచిపూడి నృత్యం అలరించింది. ప్రణవాకారం, శివాష్టకం, లింగాష్టకం, భో శంభో, నటరాజస్తుతి, అయిగిరినందిని తదితర గీతాలకు, అష్టకాలకు డి.సాయిలిక్షితాశ్రీ, రాధభవ్యశ్రీ, భవిష్య, గీతాసాహితీ, లక్ష్మీదీపిక, కార్తిక, అక్షయ, మోక్షిత నృత్యం చేశారు.

ముగిసిన శిక్షణా తరగతులు



అవగాహన కల్పిస్తున్న సుబ్రహ్మణ్యం

కొత్తపల్లి: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు, తాగునీటి అవసరాలు, పారిశుద్ధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణ, వర్మికంపోస్ట్ తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి మేరీ, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత మాట్లాడుతూ.. గ్రామాల అందరి సహకారంతోనే గ్రామాలు, పంచాయతీల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి

పాములపాడు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఈఓపీఆర్డీ గంగాధర్ అన్నారు. పాములపాడులో మూడు రోజులుగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శిక్షణలో చెప్పిన ప్రతి అంశాన్ని తూచా తప్పకుండా పాటించడం ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. కచ్చితమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని, సమస్యల పరిష్కారం కోసం సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు.





సీతారామపురం వద్ద రోడు కనిపించనంతగా కమ్ముకుపోయిన దుమ్ము,కారు ముందు ఏముందో కనిపించలేదాయే,



లైట్లు వేసుకున్నా కనిపించనంత దుమ్ము..

దుమ్ము.. ధూళి..

- శిథిలమైన నంద్యాల-గిద్దలూరు రోడ్డు
- వాహనాల రాకపోకలతో రేగుతున్న దుమ్ము
- ఎదురుగా వస్తున్న వాహనాలూ కనిపించని వైనం
- చర్యలకు ఉపక్రమించని యంత్రాంగం
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రయాణికులు

మహానంది: ముందెళ్తున్న వాహనం కనిపించదు. పక్కన పోతుంది కారా, బైకా అనేది తెలియదు. కళ్లల్లో పడే దుమ్ముకు కళ్లు మండుతూ కన్నీళ్లు వస్తున్నాయి. ఏ మాత్రం అదమరచినా ప్రాణాలు దుమ్ములో కలిసిపోవాల్సిందే... ఇదీ నంద్యాల-గిద్దలూరు రోడ్డు దుస్థితి. ఈ రోడ్డు శిథిలమవడంతో వాహనాల రాకపోకల సమయంలో రేగే దుమ్ముతో రోడ్డు మొత్తంకమ్ముకుపోతోంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి. పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు అనేకం. నంద్యాల నుంచి అయ్యలూరు, సీతారామాపురం మీదుగా గాజులపల్లె, గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే వచ్చి పోయే వాహనాలతో దుమ్ము, ధూళి నిండి ముందు, వెనుక వెళ్లే వాహనాల వారికి రోడ్డు సైతం కనిపించని పరిస్థితి నెలకొంది.అయినా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది.